# సావిత్రిస్వప్నము

బయ్యే సుబ్బారావుగారు

"కన్యా విక్రయులై ధనంబునకపేక్షం జెంది లోకంబునం
దన్యాయం బొడిగట్టికోదలచి దుర్వ్యాపారము లూహింప సా
మాన్యప్రాభవమిచ్చగించి; రకటా! మర్త్యాళిశిక్షింపలే
రన్యల్; నీవు సహించియుండుటకు చోద్యంబయ్యె సీతాపతీ"॥

నేనొక బ్రాహ్మణవితంతువును. సన్నాయిపాటలు పాలకీప్రయాణములు నాకించుకజ్ఞప్తియుండుటచే నేను పుట్టుకతోడనే పూర్వసువాసినిని కానన్న విషయము స్పష్టమగుచున్నది. నాతలిదండ్రులు నాకు సావిత్రియని పేరిడిరి. ప్రేమయననేమియో భర్త యననేమియో యెరుగని నాకు, నిజేశు డీ జీవితములకై యమునితో వాదులాడి, మెప్పించి తత్ప్రాణముతో బాటత్తమామలకు జననీజనకులకు శుభంబులుగొన్న సౌభాగ్యవతియగు సావిత్రిపేరామెకేతగును గాని నాబోటి నికృష్టజీవి కెట్లు వర్తిలును? ఆమె పతివ్రతలలోనెల్ల నగ్రగణ్య. భర్తకై తన సర్వస్వము నర్పింపసమకట్టినది. చిరకాలము భర్తృసేవాపరాయణయై పేరువడసిన పరమసాధ్వి. నేనన్ననో భర్తముఖమైన జూడనోచుకోనని పరమదౌర్భాగ్యను.

పన్నెండు సంవత్సరముల వయసువచ్చువరకు చాల సౌభాగ్యముగనే యుంటిని. కాని యొకనాటి సూర్యోదయమున కటికవాడు మేకగొంతుకోసి చర్మము దిగతీసినట్లు నా శరీరమందలి సర్వాభరణములు మాతలిదండ్రులు నిర్దయులై తీసివైచిరి. ముద్దుగుల్కు ముంగురులతో బాటు నా కేశభారమును విదళించిరి. కటిక నేల పరుండవలెననియు, ఒక్కపూటమాత్రమే భుజింపవలెననియు వేడినీళ్లు స్నానముచేయరాదనియు కట్టడిజేసిరి. జాకెట్టు—కాదు, తుదకు రవికల గుడ్డకూడ నిషేధింపబడినది. ఇట్టి కఠిననరకము ననుభవించుటకు సంసిద్ధనైకూడ యుండలేదు. శాఖాఖండితరసాలముకైవడి వివర్జితాలంకారనై కురూపినై కుందవలసివచ్చెను. ఈ హఠాత్సంఘటనమున కేనెంతయు కలగిపోయితిని, పొగిలిపోయితిని. ఆదినములలో శాసనోల్లంఘనోద్యమముగాని, అట్టి యితరోద్యమములుగాని నియమములలో లేకున్నను నిష్కారణముగ మూడవతరగతి ఖైదీనైతిని. ఎందుచేత నన్నిట్లుశ్రమపెట్టుచున్నారని యొకదినము నాతల్లినడిగితిని. "నీమగడు చచ్చాడుకదూ!!" అని కండ్లనీరు గ్రక్కుకొనుచు చెప్పినజవాబు తప్ప వేరేమియు నామె వాక్రుచ్చియుండలేదు. కాని ధనాశచే నాతండ్రి నన్నొక ముదుసలికిచ్చి వివాహము— కాదు విక్రయించినట్లు లిరుగుపొరుగమ్మలక్కలవలన దెలియవచ్చినది. నాకమోఘవైధవ్యము. నాతండ్రికనూనధనప్రాప్తి. అదంతయు గతజలసేతుబంధనము.

కొంతకాలమునకు నాతల్లి మరణించెను. మాకుటుంబమునకు నా జనకునిక్రొత్తయత్త అధికారిణియాయెను. ఆమెయు నావలె ముండమోపి యని వేరుగ చెప్పనక్కరలేదు. కుటుంబవ్యవహారములయందామెకున్నంత నైపుణ్యమొరులకుండదని చెప్పుట అతిశయోక్తిగానేరదు. సూర్యోదయమైనది మొదలు రాత్రి సగమాకటితో నేలపై మేనువాల్చువరకు నారక్తమాంసము లింటిపనులకై ధారబోయవలసినదే. నాతండ్రి నా క్షేమమునుగూర్చి యెన్నడును విచారించియుండలేదు. "ఎవ్వరెట్లాబోతేనాకేమి? ఎవళ్లకూడులేకుంటేనాకేమి? నామట్టుకునాకు ఏదో ఒహ రావుబహద్దూర్‌తోబాటు నెలకు ఏఐదారువందలు కిట్టితేచాలదు?" అనే బాపతులో మనిషివలె నా క్షేమమునుగూర్చి కించిత్తైనను యోచించెడివాడు కాడు.

సంవత్సరమునకు రెండుసార్లు నాసోదరుడు సెలవులకింటికి వచ్చుచుండెడివాడు. నన్ను చాలగారాబముతో ప్రేమించుచుండెడివాడు. అన్నరసముకంటె

ఆదరరసము ఎక్కుడుగదా! తానింటికడనున్న దినములే నాకు సౌఖ్యదాయకములు. ఆదినములలో కడుపార నన్నము లభించెడిది. అట్లు కానిచో మాతండ్రికి తెలియచేయుటయో లేకున్న కలహము లేపుటయో జరుగకమానదని మాయజమానురాలు జాగ్రత్తపడియే యుండెడిది. మత్సోదరు డప్పుడప్పుడు సమీపమున గూర్చుండి విధవ లింతకఠినముగా జూడబడనిచోట్ల గూర్చియు, ముండమోపులు పునరుద్వాహము గావించుకొను ప్రదేశముల గూర్చియు పెద్దగా చెప్పుచుండెడివాడు. అట్టి గాథల నాకర్ణించునపుడెల్ల నామనోరంగమున నూతనకోరిక లీలికలెత్తుచుండెడివి. ఒక్కొకతఱి మనదేశపు 'విధవ చట్టములపై' తిరుగుబాటు చేయుదమని యుద్రేకము గలుగుచుండెడిది. కాని నానిస్సహాయత యింతలోనే నిస్పృహగొలుపుచుండెడిది. స్త్రీలు మాత్రమే యెందుచేత నింతటి దుర్భరకష్టములకు పాలుగావలయును? ఏబదివర్షములప్రాయుడగు నాతండ్రి నాకండ్లయెదుటనే నాకంటె మూడేండ్లు చిన్నవయస్సుపిల్లను బెండ్లియాడెనే! నేనొకపురుషుని వివాహమాడి నాయక్కచెల్లెండ్రవలె నేల సౌఖ్యముగ నుండరాదు? నామనోరంగము నొకని కర్పింపక యెన్నినాళ్ళిట్లు ఖాళీగా నుంచవలయును? స్త్రీలకు పురుషులకు ఒక్కడే భగవంతుడా లేక వేర్వేరుభగవంతులా? ఇట్టి ఘోర కష్టము లనుభవించుటకంటె సహగమనమే వేయిరెట్లు సౌఖ్యముగనుండెడిదే! ఇతరుల ప్రేమింపకయు నితరులచే ప్రేమింపబడకయు యెన్నినాళ్ళు గడపగలను?

నా మారుటితల్లికాపురము నాబ్రతుకంతటి నిరర్థకముగాకపోయినను మొత్తముమీద నామె తనతోడివారలనుభవించుచున్నంతసౌఖ్యమును అనుభవించుటలేదు. ఆమె ప్రాతనేస్తునివలె పరిగణింబడుచుండెడిది. వీధిగుమ్మములో నిలుచున్న తప్పు; తలదువ్వి కీల్జడవేసినచో ముప్పు. ఆమె "ఏక్లాసు ఖైదీ" నేను "సిక్లాసు" ఖైదీని. ఒకనాడంట్లుతోముచున్నప్పుడొక పాత్రచేయిజారి క్రిందపడి బీటవారినది. ఇక చెప్పతగ్గదేమున్నది? వర్షపాతమువలె తెడ్డుదెబ్బలు నానెత్తిపైపడినవి. తిట్లులసంగతి వేరుగ చెప్పనక్కరయేలేదు. నా పాలిటి మృత్యుదేవతయోయన భయంకరాకారముతో మా ముసలియజమానురాలు నామీద విజృంభించినది. ఎంతకై యోర్చియుండగలను? చేతనున్న రాగిపాత్రతో నేను కూడ యెదుర్కొంటిని. శాంతము నన్ను వీడిపోయినది. సత్యాగ్రహము నిష్ఫలమైనచో విగ్రహమే కర్తవ్యము గదా? నా కసిదీరయామెపైబడి మోదితిని. తిరిగి వంటపాత్రలు ముట్టకయే నా ఖైదుకొట్టు—ఖైదుకొట్టుగాకింకేమియగును? —నా ఖైదుకొట్టుబ్రవేశించి లోపలబీగము వైచుకొని యేడ్చుచు గూర్చుంటిని. ఏడ్చిఏడ్చి నిదురపోతిని. నాజీవితమందు సుషుప్తియే సుఖావస్థ. ఆట్టి సుషుప్తియందపూర్వమగు నొకకలగంటిని. సావధానచిత్తులై యాకర్ణించినచో నాస్వప్నగాథ వ్యక్తపరచెదను.

"నేను పూర్వమువలె బోడిముండనుకాను. ఆకటిచే కృశించిన యింటిపనికత్తెనుకాను. చక్కనియువతినైతిని. బాహువులనుమించి శిరోజములు వ్రేలాడుచున్నవి. స్వర్ణకాంతిని నిర్జించు నామేన నత్తరుపన్నీరులలందుకొంటిని. అమూల్యాభరణములచే స్వాకృతాలంకృతినైతని. పీతాంబరములు ధరించితిని. బుటేదారుపనిచేసిన జలతారుపాదరక్షలధరించి పురవీధులలో విలాసముగా తిరుగుచుంటిని. ఆపట్టణరాజము నాకెంతయు నపూర్వము. దానిశోభ వర్ణింప నాకశక్యము. ఎత్తైనమేడలు, వింతవింత ప్రాసాదములు, స్ఫటికశిలానిర్మితములై రమణీయముగనున్నవి. చలనహేతుశకటములు, త్రొక్కుడుబండ్లులెక్కకుమించి రాజబాటలయందతిరయమున తిరుగాడుచున్నవి. ఎచ్చోటచూచినను స్త్రీలే కాన్పించుచుండిరి. బాటలన్నియు స్త్రీజనసంకీర్ణములై విరాజిల్లుచున్నవి. విలువైన చలువవసనములధరించి విలాసముగ తిరుగువారు, తులలేని నగలుధరించి వివిధశకటము

లధిరోహించి వాహ్యాళి బోవువారు లెక్కకు మించియుండిరి. పురుషులు చాలయరుదుగ గన్పడు చుండిరి. వారైనను బెదురుచూపులతోను అదురునడకలతోను పోవువారు. తెరువబడియున్న గవాక్షముల గుండచూచిన పురుషులనేకు లింట కార్యనిమగ్నులై యుంట దృగ్గోచరమగు చున్నది. కొందరు స్త్రీలు గృహోపకరణములం దుచితపీఠములం దుపవిష్టులై యుండ పురుషులు వారిచెంత చేతులుకట్టుకొని నిలువబడుటయో లేక వారికి వలయు సౌకర్యముల నొడగూర్చుచుండుటయో గానవగుచున్నది. కొన్ని కిటికీలనుండి జడలుకట్టిన శిరోజములు, దుబ్బుగా పెరిగి చీదరబుట్టించు గడ్డములుగల పురుషుల ముఖములు కన్పించుచున్నవి. క్షౌరముగాని, స్నానముగాని, నూనెతో శిరోజముల చక్కజేయుటగాని వారిపాల నిషేధింపబడినట్లు దోచుచున్నది. జీర్ణమలినవస్త్రముల ధరించియుండిరి. శరీరములు చాలకృశించి యున్నవి. అంతియకాక వారు నడచునపుడు వారి మెడలయందు కట్టబడిన చిరుగంటలు గణగణమని ధ్వని చేయుచున్నవి. నన్నుచూచి వారు తలుపులు బిగించుకొన మొదలిడిరి. అట్లు చేయుటచే వారిని సాంతముగ చూడ కోరిక హెచ్చసాగెను.

అట్లుతిరుగుచు నే నొకదివ్యప్రాసాదముముంగల చేరితిని. ఆభవన పురోభాగమున నొక స్త్రీ సుఖాసీనరై యుండెను. ఆమె వయసున ముప్పదికి మించియుండును. ఆమెచెంత ద్వాదశప్రాయుండగు యువకు డొక డొక్కతాళవృంతము చేబూని యామెకు విసురుచుండెను. నన్నుజూచి యామె మందహాసము చేయుచు చేరవక బిలిచినది. నన్నొక కుర్చీమీద కూర్చుండ నియమించినది. అట్టియువకుడున్నచోట నిలుచుండుటయే నాకు సిగ్గుగాతోచును. కాని యామె నిర్బంధముజేసిన కూర్చుండక తప్పినది కాదు. నన్నుచూచి ఆయువకుడే చాలసిగ్గిలసాగెను. తొట్రుపడజొచ్చెను.

సమీపమున సేవకు లెవరును లేకుండుటచే ఆ యువకునిచేతనే నాకై కొంచెము 'కాఫీ' తెప్పించినది. అనంతరము మాకిరువురకు క్రిందిసంభాషణ జరిగినది.

ఆమె: 'ఈపట్టణమునకు మీరు క్రొత్తగా వచ్చినట్లు తోచుచున్నది.'

నేను: 'ఔను, నా కీపుర మపూర్వము. ఇచ్చటి విశేషములు నాకెంతయు ననూహ్యములుగ నున్నవి.'

ఆమె 'మీరు పురుషరాజ్యమునుండి వచ్చినవారు కావచ్చును. ఇయ్యది స్త్రీరాజ్యము. ఇచ్చట శాసనములు, పద్ధతులు వేరు.'

నేను 'అట్లే తోచుచున్నది. ఇచ్చట ప్రతివిషయము నాకాశ్చర్యము కలిగించుచున్నది. ఇప్పటివర కిచ్చటనుండి, ఇప్పుడు లోపలకుబోయిన పురుషు డెవరై యుండవచ్చును?'

ఆమె: 'అతడు నాభర్త—నా రెండవభర్త.'

నేను: 'ఏమి? రెండవభర్తయా? ఇచ్చట స్త్రీలు రెండేసి వివాహములు చేసికొనవచ్చునా?'

ఆమె 'ఔను రెండేకాదు, ఎన్నివివాహములయినను చేసికొనవచ్చును. మాయక్కకు మొదటి భర్తవలన సంతానము లభింపమి తిరిగి వేరొక యువకుని బెండ్లాడినది. అత డచిరకాలముననే మరణించుటచే మొన్ననే యింకొకనిని పెండ్లియాడినది. ఆమెకు మొదటి భర్తవలన యిరువురు పుత్త్రులు గలరు కాని 'అపుత్త్రిస్యగతిర్నాస్తి' యను వేద వాక్య మమోఘముగదా!'

నేను: 'మీ మాటలు నా కాశ్చర్యమును గలిగించుచున్నవి. మీయక్కవయసెంత?'

ఆమె: 'ఆమె కిప్పుడు నలుబదియవ సంవత్సరము. అందుచేతనే ఆమె వంశోద్ధరణకొఱ కొక యాడుసిసువుకై యారాటపడుచున్నది. చాల ధనమున్నది కాని యాడుసంతానములేదు. ఇప్పటిభర్త చాల యోగ్యుడు. వినయవిధేయతలు గలవాడు. శీఘ్రకాలముననే యామెకు భగవంతు డొక స్త్రీ శిశువును బ్రసాదించుగాక.'

నేను: 'ఏమి! వంశము నుద్ధరించువారు పురుషులా స్త్రీలా? ఆస్తికి వారసత్వపుహక్కు ఆడుపిల్లల కెట్లు కలుగును?'

ఆమె: 'మీమాటలు నా కాశ్చర్యముగనున్నవి. ఆస్తి యాడుబిడ్డలదిగాని మగబిడ్డలదికాదు. ఆపె కుమారులు తమతమ భార్యల యిండ్లకుబోయి కాపురము చేయుదురు. మత్సోదరి వారలకు కొలదిగా విద్యాభ్యాసము చేయించినది. పురుషవిద్య పశువు చేటని యనేకు లాక్షేపించిరిగాని మేమది లెక్కగొనలేదు. కుటుంబవ్యవహారమునందు గూడ వారిని బాగుగ తర్ఫీతుచేసినది. వారి కుచితకాపురములు లభించు టంత కష్టమైనపనికాదు. నాభర్త సంగతి చూడుడు. అతడు గౌరవమైన కుటుంబమునకు చెందినవాడు. సాంసారికవిషయములం దసమానకౌశలము గలవాడు. మిమ్ము గాంచి యతడు సిగ్గుజెందుట మీరు గమనించియే యుందురు. నాకట్టి దెంతమాత్రము సహింపదు. నేను సంఘసంస్కారపక్షమునకు జెందినదానమ. నాస్నేహితునితో చనవుగా తిరుగుటకు మాట్లాడుటకు నే నెంతయు ప్రోత్సహించుచుందును. నాతో కలసి బహిరంగసభలకు గమ్మని బలవంతపఱచుచుందును. కాని యాచారమన్నిటికి నడ్డుతగులుచుండును.

ఏడ్చుచున్న పసిబిడ్డ నెత్తుకొనివచ్చి యామెభర్త యామె కుర్చీవెనుక వినమ్రుడై నిలువబడి పదిలముగ బిడ్డ నామె యొడియం దుంచెను. ఏతద్దృశ్యము నా కత్యంతాశ్చర్యము గలిగించెను. కాని యంతకంటె నెక్కుడాశ్చర్యము నద్భుతము గలిగించు మెడయందు చిఱుగంటలున్న విపరీతపురుషుల యుదంతము తెలిసికొనగా మనను వేగిరపడుచుండెను. తుద కావిషయమై ప్రశ్నింప నామె 'వారు తమ భార్యల గోల్పోయిన దురదృష్టవంతులు. వా రాజన్మాంతమవ్విధముననే యుండవలయును. వారి పునర్వివాహములు మా సాంప్రదాయముల కననుకూలములు' అని జవాబిచ్చెను.

'శిరోజములను, గోళ్లను పెంచుకొని వికృతాకారమును పొందియుండుటకు కారణమేమి?' యని నే నడిగితిని.

'పత్నీహీను లపవిత్రులు. శుభకార్యములందు వారి దర్శన మమంగళము. తక్కిన పుణ్యపురుషుల నుండి వారిని వేరుగా నుంచుటకును, విలాసవతుల కంటబడకుండుటకై హెచ్చరికకుంగాను, యితర స్త్రీలచే వారు ప్రేమింపబడకుండుటకు వారియాకారములు వికృతములుగా నొనర్పబడి యందు గంటలు కట్టబడినవి.' అని యామె జవాబిచ్చినది.

'వీ రాజన్మాంతము వివాహము జేసికొనకుండవలసినదేనా' యని తిరిగి ప్రశ్నించితిని.

'మా శాస్త్రనియమముల ననుసరించి యట్లే యుండవలయును. అందిట్లు వ్రాయబడి యున్నది,-'పత్నీహీనుడు పునరుద్వాహము గావించుకొన్నచో భార్యకు దేవలోకమున మనోస్వస్థతయుండదు. వాని పితృదేవతల కేడు జన్మములవరకు పుట్టగతులుండవు. తాను రౌరవాది ఘోరనరకములకు లోనౌను. భార్య సజీవయైనను నిర్జీవయైనను సరే తచ్చరణ సేవానురక్తులకే మోక్షప్రాప్తి. మరియు వైధవ్య మనుభవించు పురుషుడు క్రొత్తదుస్తులుగాని శుభ్రవస్త్రములుగాని ధరింపరాదు. దినమున కొక్కపూటయైనను తప్పక యుపవసింపవలెను. సంవత్సరమున కొకటి రెండుసార్లుకంటె నెక్కుడు స్నానముచేయరాదు. నఖశిఖఖండన మసలే కూడదు. నూనెరాసి తల చక్కజేయరాదు. ఈ నియమములలో నేది తప్పినను దేశమునకు క్షామము వాటిల్లును. అన్నియుదప్పిన ప్రళయమే సంభవించును' అని వ్రాయబడి యున్న'దని యామె నుడివెను. పిమ్మట భర్తవైపుచూచి 'రామూ! ఆమె చాల అలసినట్లున్నది కొంచెము తేనీరు తీసికొనిర'మ్మని చెప్పినది. చెప్పుటయే తడవుగ నాయన లోనకుబోయెను. మా సంభాషణమాత్ర మాగలేదు.

ఆమె: 'దుర్భరవైధవ్యదుఃఖ మనుభవించుట వయసుచెల్లినవారికే కష్టతమము. ఇక పడుచువారల సంగతి వేరుగ జెప్పవలయునా? లేబ్రాయపు కన్నెలనేకు లీ యకాలసంఘటనకు గురియగుచున్నారు. అట్టివారి సంరక్షణకుగాను మొన్ననే మే మొక చట్టమును శాసనసభయందు ప్రవేశపెట్టి విజయము గాంచితిమి. కాని పునర్వివాహము చేసికొన సాహసించు పురుషులు బహుఅరుదు. ఆక్షేపణలు మెండు. పాడుశాస్త్రము లెప్పుడు రచింపబడినవోగాని యనేక పసిబాలురకు ప్రాణకంటకములుగా నున్నవి. నిజముగా పురుషులచే రచియింపబడినచో నింత యనర్థదాయకములుగా నుండియుండవు. భగవంతుని దృష్టిలో నందరము సమానులమే. అం దొకరికి మహావైభవము మరియొకరికి బలవద్దుఃఖప్రాప్తి. అందరి యెడలను సమముగా వర్తించునవే శాస్త్రములన నొప్పును గాని ప్రత్యేకవ్యక్తిక్షేమము నామోదించునవి శాస్త్రములు గావని ఘంటాపథముగా చెప్ప గలను. శాస్త్రము లేమి చేయుచున్నవి? లెక్కకు మీరిన పెక్కుయువకుల జీవితముల నడవిగాచిన వెన్నెలవగిది నిరర్థకములు చేయుచున్నవి.'

నేను: 'మీ పురుషు లిట్టి కట్టుబాట్లకు లోనయి వర్తింతురా? వారికీ నియమములు కటువుగా నున్నవని తిరుగుబాటు చేయరా?

ఆమె: 'తిరుగుబాటా! విధవపురుషులు తిరిగి పెండ్లియాడవచ్చునని శాసనమును మే మమలునకు దెచ్చినందు కనేక పురుషులు తమ పత్నీవ్రతమునకు భంగమాపాదించితిమని మాసంఘసంస్కరణపక్షమువారిని దూషించుచున్నారు. పూర్వము భార్యచచ్చినచో భర్త నామెతోబాటగ్ని కాహుతిజేసెడివారు. కాని యట్టి యమానుషకార్యములు జరుగరాదని ప్రభుత్వమువా రొక యసాధారణ చట్టము నమలు వఱచుటచే నిప్పు డది చాలమట్టుకు తగ్గినది. ఐనను అట్టి వక్కడక్కడ ఇంకను జరుగుచున్నట్లు వినుచునే యున్నాము. తమ భార్యల చితిపై దాము చచ్చుటకు ప్రభుత్వమువారు నిరోధించుటంజేసి నీటమునిగియో, విషముద్రావియో, యురిపోసికొనియో కొందఱు పురుషులు చచ్చుచునే యున్నారు నాభర్త కొంతచదువుకొన్నవాడే యైనను యిట్టి విషయములందు పట్టుదల గలవాడు. ఇట్టి ప్రశంస నెత్తినచో వాని యభిప్రాయమును మీరే తెలిసికొనగలరు.'

ఇంతలో నామెభర్త తేనీరు దెచ్చుటచే నామె బలవంతమునంజేసి యొకించుక గ్రోలితిని. ఆమెయు త్రావుట చాలించి 'రామూ, ఈమె మనరాజ్యమునందు పురుషపునరుద్వాహముగూర్చి నీయుద్దేశమును విన గోరుచున్నది. సిగ్గిలక నీయభిప్రాయమును వెల్లడించుము' అని చెప్పినది.

ఆయన కొంచెము సిగ్గుపడెను గాని యెట్టకేలకిట్లు నుడువ నారంభించెను. "ఎంత దారుణము! భార్యావిహీనుడు మరల పెండ్లియాడుటయా? కలికాలము! పవిత్రుడైనపురుషు డొక్క భార్యను దప్ప యితరుల ప్రేమింపనొల్లడు. భార్యయే దైవము, భార్యయే సర్వస్వము. తన కేడుగడయగు భార్యను పోగొట్టుకొన్నచో నది వానిపురాకృతకర్మము. మరుజన్మమున నామెనే పత్నిగా బడయుటకై నిరంతరము ప్రార్థనలు చేయుచు శేషజీవితమును గడుపవలయును. నుదుటివ్రాత దప్పింప నెవరిశక్యము! భర్తకు భార్య తోడిదే లోకమనియు, పత్నీపదకమలపూజయే పరమావధియనియు పురాణములు ఘోషించుట లేదా?'

అట్టి మాటలు వినుటకు నాకే సిగ్గగుచున్నది. ఆశ్చర్యమునకు మేరయేలేదు. అయినను సాహసించి 'స్త్రీలుమాత్రము రెండవవివాహము చేసికొనుట లేదా? మీరేల చేసికొనరాదు?' అని ప్రశ్నించితిని. అందు కాయన 'వారు స్త్రీలు. మేము పురుషులము. వారెన్ని వివాహములు చేసికొన్నను తప్పులేదు. మేమో, పురుషులము. మాకు పత్నీవ్రతమే

పరమధర్మము. పత్నీవ్రతుడుకాని పురుషున కిహపరములయందు తావులేదు. శాస్త్రసమ్మతము గాని పనులు చేయుట కెవరు సాహసింపగలరు? పత్నీవ్రతుడు ప్రాణమైనను గోల్పోవుట కొప్పుకొనును గాని పరస్త్రీలను కన్నెత్తియైనను చూడ సాహసింపడు' అని జవాబిచ్చెను.

ఆమె నన్నుజూచి నవ్వుచు, 'చూచితిరా! అతని జవాబు. నేను సంస్కరణసభకు కార్యదర్శిని. మా 'యింటాయన' యభిప్రాయము లిట్లున్నవి. వారి క్షేమమునకు వారే ప్రబలశత్రువులు కానున్నచో మన మింకేమి చేయగలము?' అని పలుకుచు భర్తవైపు తిరిగి, రామూ! నీవిట్టి పిచ్చియభిప్రాయములు వదలి నాయుద్దేశములతో నేకీభవించి యుండనిచో నిజముగా నిన్ను విసర్జించి భార్యావిహీనుడగు వేరొక చక్కని యువకుని బెండ్లియాడెద'నని చెప్పెను. ఆయనయు సిగ్గున తలవంచి చిరునగవునవ్వుచు బిడ్డ నామె యొడియందు బెట్టుచు, 'మీచిత్తము వచ్చినచో నట్లే చేయుడు. మీకెవ్వ రడ్డుచెప్పగలరు? మీరు సర్వాధికా......'ఇంతలో తలుపు నెవరో తట్టుటచే మెలకువవచ్చినది. ఇక చెప్పవలసిన దేమున్నది? విధి వినిర్మిత—కాదు, కాదు, శాస్త్రములసృష్టించిన సృష్టికర్తలచే విధింపబడిన నా యీబాలవైధవ్య దుఃఖమును నేను మీకు విన్నవింప దలంచుకొనలేదు. వైకుంఠ సౌఖ్యము నొడగూర్చు ఇట్టి స్వప్నదృశ్యముల నేనినైన మరల గాంచుభాగ్యము లభించినచో నయ్యది తప్పక మీకు నివేదించుకొందును.

## భావకాహ్వానము

అబ్బరాజు వెంకటరంగారావుగారు

భావా! నీకాహ్వానము.
ఈవా! మా కతులితలంపు టీవుల ప్రోవుల్
భావా! స్వాగతమిదిగో
ఈవా? మా కనవరతము నీప్సితసిద్ధుల్.

తెల్గుభూము లపంట తేలిపోయినదంట సమకూర్తువా మాకు సస్యలక్ష్మి.
తెల్గురాజసమంత దిక్కులదాగెను రప్పింతువా వారి రాజ్యలక్ష్మి
తెల్గుసంపదలెల్ల దేశాలబట్టెను తిరిగిచేర్పింతువా దివ్యలక్ష్మి
తెల్గుమాధ్యంబెల్ల తెట్టువగట్టెను పూనిసాయింతువా జ్ఞానలక్ష్మి

తెల్గువారలు అన్నిట తెన్నుమీరి
తెల్గుగృహలక్ష్మి దీప్తిచే తేజరిల్లు
తెల్గుసీమలు శుభముచే దేలునట్లు
తెల్గుదేశంపుభావ! నీతెల్వి జూపు.